వైభవంగా ఘటం ఊరేగింపు



అంబర్‌పేట: అంబర్‌పేట మహంకాళి అమ్మవారి ఘటం ఊరేగింపును ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలో ప్రత్యేక పూజాలు నిర్వహించి ఘటాన్ని ప్రారంభించారు. ఆలయం నుంచి బొడ్రాయి వరకు ఘటం ఊరేగింపు సాగింది. ఈ ఘటాన్ని మోర పాండు ముదిరాజు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు కె. దుర్గాప్రసాద్‌రెడ్డి, పి.జ్ఞానేశ్వర్‌గౌడ్, గడ్డం లక్ష్మణ్‌గౌడ్, వై.శంకర్‌గౌడ్, రంగం పల్లి రాజు, బి. మల్లికార్జున్‌గౌడ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పీర్లకు దట్టీలు, పంజా సమర్పణ



నల్లకుంట బజాజ్ ఎలక్ట్రానిక్స్ పక్క లేన్‌లో పీర్లను సందర్శించిన ఎమ్మెల్యే



దట్టీలు సమర్పించిన మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిరెడ్డి

నల్లకుంట/అంబర్‌పేట: మొహర్రం పండుగను పురస్కరించుకొని ముస్లింలు నల్లకుంట బజాజ్ ఎలక్ట్రానిక్స్ పక్క లేన్‌లో పీర్లను ఏర్పాటు చేశారు. సోమవారం ఆ పీర్లను సందర్శించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ దట్టీలు, పంజా సమర్పించి ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అమృత, బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. అదే విధంగా బాగ్‌అంబర్‌పేటలో జరిగిన మొహర్రం వేడుకలకు సోమవారం మాజీ కార్పొరేటర్ కె. పద్మావతిరెడ్డి హాజరై దట్టీలు సమర్పించారు.

కూలేందుకు సిద్ధంగా..!

శిథిలావస్థలో నారాయణగూడ ఐపీఎంలోని భవనాలు

పెచ్చులూడుతున్న పైకప్పులు



- భవనాల గోడలకు భారీ పగుళ్లు
- బిక్కుబిక్కుమంటూ ఉద్యోగుల విధుల నిర్వహణ
- సర్కిల్ పరిధిలో ప్రమాదకరంగా పాత భవనాలు
- చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం

కాచిగూడ: శిథిలా భవనాలు ప్రమాదకరంగా మారాయి. అసలే వర్షాకాలం.. చిన్నపాటి వర్షం పడ్డా కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. తూతూమంత్రంగా అధికారులు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఫలితంగా ప్రతి వర్షాకాంలో ఏదో ఒక చోట పురాతన భవనాలు నేలకొరుగుతున్నా అధికారులు మాత్రం క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. గుర్తించిన శిథిలాభవనాలను తక్షణమే తొలగించాలని కోరుతున్నారు.

దంపింగ్ కేంద్రంగా ఐపీఎం ప్రాంగణం..

ఐపీఎం ప్రాంగణం మొత్తం చెత్త డంపింగ్ కేంద్రంగా మారిపోయింది. ఐపీఎం ప్రాంగణం విశాలంగా ఉండటంతో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే కనిపిస్తున్నాయి. ప్రమాదకరమైన మెడికల్ వేస్టేజీని కూడా ప్రాంగణంలో ఎక్కడ పడితే అక్కడే పడేస్తున్నారు. ల్యాబ్‌ల్లో రోగుల నుంచి తీసిన వివిధ నమూనాలకు సంబంధించిన సిరంజీలు, బాటిల్స్ కూడా ఇక్కడి చెత్త కుప్పలపై దర్శనమిస్తుంటాయి.

- ఐపీఎం ప్రహరీకి అనుకుని అపార్ట్‌మెంట్స్‌తో పాటు ఇళ్లు ఉన్నాయి. మాడపాటి హనుమంతరావు బాలికల ఉన్నత పాఠశాల, రెడ్డి మహిళా హాస్టల్ కూడా ఉంది. ఇక్కడ వందలాది మంది విద్యార్థినులు చదువుకోవడానికి వస్తుంటారు. బాలికల పాఠశాల కిటికి ఓపెన్ చేస్తే దుర్వాసన వస్తోందని విద్యార్థినులు ఫిర్యాదులు చేస్తున్నారు. ఎప్పుడు ఎలాంటి రోగాలు వస్తాయోననే భయాందోళనలతో స్థానికులు గడుపుతున్నారు.

తాగుబోతులకు అడ్డాగా...

ఐపీఎంకు సరైన సెక్యూరిటీ లేకపోవడంతో రాత్రి సమయాల్లో ఐపీఎం ప్రాంగణంలో చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతున్నాయనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నారు. ఐపీఎం ప్రాంగణంలో ఎక్కడ చూసినా మందు సీసాలే దర్శనమిస్తున్నాయి. పోలీసులు కూడా ఐపీఎం వైపు కన్నెత్తి చూడకపోవడంతో మందుబాబుల ఆగడాలు రోజురోజుకు మితిమీరి పోతున్నాయని స్థానికులు తెలిపారు.

- ఐపీఎం ప్రాంగణంలో డ్రైనేజీ పైపులైన్ మూతలు పూర్తిగా విరిగిపోయి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ఐపీఎంకు వచ్చే ప్రజలకు, అక్కడ పని చేసే ఉద్యోగులు, సిబ్బందికి సరైన టాయిలెట్స్ లేకపోవడంతో నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉన్న ఒకట్రెండు టాయిలెట్లు దుర్గంధంగా మారిపోయాయని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

శిథిలావస్థలో ఐపీఎం భవనాలు...

నారాయణగూడలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం)లోని భవనాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. వర్షాల నేపథ్యంలో ఏ క్షణాన అవి కూలుతాయోనని అందులో పనిచేస్తున్న ఉద్యోగులు, ఐపీఎంకు వచ్చే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఐపీఎంలో వైద్య విభాగానికి చెందిన దాదాపు 8 భవనాలు ఉన్నాయి. వాటిలో చాలా భవనాలను వందేళ్ల క్రితం నిర్మించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇక్కడే వివిధ రోగాలను గుర్తించటానికి ప్రత్యేక ల్యాబ్‌లు ఉన్నాయి.

- కుక్కకాటుకు ఇంజెక్షన్, మోడల్ బ్లడ్‌బ్యాంక్, విదేశాలకు వెళ్లే విద్యార్థులకు వ్యాక్సినేషన్ ఇచ్చే కేంద్రాలు ఇందులో పనిచేస్తున్నాయి. నిత్యం వందల సంఖ్యలో ప్రజలు ఇక్కడకు వస్తుంటారు. అయితే ఇక్కడ ఏ క్షణానైనా కూలిపోయేలా దర్శనమిస్తున్న పురాతన భవనాలు చూసి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇక్కడి ఉద్యోగులు కూడా తీవ్ర ఆందోళనల నడుమ విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పాత భవనాలు కూల్చివేసి వెంటనే కొత్తవాటిని నిర్మించాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

సర్కిల్ పరిధిలో ప్రధానంగా శిథిలావస్థలో ఉన్న 25 భవనాలను గుర్తించాం. ఆ శిథిలా భవనాల యజమానులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. అందులో ఉంటున్న వారిని ఖాళీ చేయాల్సి ఉంటుంది. ఇతర విభాగాల సహకారంతో శిథిలా భవనాలను కూల్చి వేస్తాం. టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో కలిసి మారోసారి క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తాం.

-మారూతీదివాకర్, సర్కిల్-16 డీఎంసీ



శిథిల భవనాల్లో పేరుకుపోయిన మెడికల్ వేస్టేజీ, చెత్తాచెదారం



నారాయణగూడ ఐపీఎంలో శిథిలావస్థలో ఉన్న భవనాలు

అర్చకుల బదిలీల నిర్ణయాన్ని విరమించుకోవాలి

చాత్తాద శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్



అశ్వాపురం వేణుమాధవ్‌కు సమస్యలు వివరిస్తున్న అర్చక స్వాములు

నల్లకుంట: దేవాదాయ శాఖ పరిధిలోని వివిధ ఆలయాల్లో అనువంశిక, వంశపారంపర్యంగా విధులు నిర్వహిస్తున్న అర్చకులను బదిలీ చేసే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని, ఆ నిర్ణయాన్ని విరమించుకోవాలని తెలంగాణ చాత్తాద శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్ కోరారు. అర్చకులను బదిలీ చేస్తే వారి కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయన్నారు. నల్లకుంటలోని చాత్తాద శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన దేవాలయాల అర్చకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. అర్చకుల బదిలీల ఆలోచనను విరమింపజేసేలా ప్రభుత్వ పెద్దలతో మాట్లాడాలని వేణుమాధవ్‌ను అర్చక స్వాములు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బదిలీలు చేపడితే అర్చకుల కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటాయన్నారు. దేవాదాయ శాఖ మంత్రి, ఎండోమెంట్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి అర్చకుల బదిలీలు నిలుపుదల చేయిస్తానని చెప్పారు. సమావేశంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వివిధ ఆ లయాల నుంచి వచ్చిన అర్చకులు తిరునగరి సంపత్ కుమార్, శ్రీరాములు, వెంకట్ పూజారి ము కుండ్, తంబిరాజు, శ్రీకృష్ణ, కురుమూర్తి శ్రీరాము లు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.8,214 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ తెలంగాణ ప్రధాన కార్యదర్శి పి.నాగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాంనగర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆరేళ్లుగా విద్యార్థులకు ఫీజులను చెల్లించడం లేదన్నారు. ఏడాదికి 4లక్షల మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకుంటున్నారని తెలిపారు. 2019 నుంచి ఇప్పటి వరకు బకాయిలు పేరుకుపోయాయని పేర్కొన్నారు. 2019-20 సంవత్సరానికి రూ.800 కోట్లు, 2020-21కి రూ.2366 కోట్లు, 2021-22కు రూ.2100 కోట్లు, 2022-24 వరకు రూ.2958 కోట్ల బకాయి ఉన్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం మాదిరిగానే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అలాగే వ్యవహరిస్తోందని విమర్శించారు. బకాయిలు ఇవ్వకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యశ్వంత్, ప్రశాంత్, నరేష్, సురేష్, శ్రీరామ్, శ్రీను, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

28న కనకాల కట్టమైసమ్మ ఆలయ బోనాలు

వేడుకల బ్రోచర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్

కవాడిగూడ: లోయర్ ట్యాంక్‌బండ్‌లోని శ్రీకనకాల కట్టమైసమ్మ దేవాలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అధికారులను ఆదేశించారు. సోమవారందేవాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బోనాలు సమర్పించేందుకు వచ్చే భక్తులకు మంచినీరు, రోడ్లు, వీధి దీపాలు, శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా, ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఈనెల 28వ తేదీన బోనాలు, 29వ తేదీన రంగం కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం



బోనాల వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, ఆలయ ఫౌండర్ చైర్మన్ గోల్కొండ గౌతం కుమార్ పటేల్, ఆలయ ఈవో సాంబశివరావు, సర్కిల్-15 డీఎంసీ మోహినొద్దీన్, ఏఎంవోహెచ్ డాక్టర్ మైత్రేయి, తహసీల్దార్ సంధ్యారాణి, చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ వీరేశం, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖావాణి, ఏఈ జ్యోతిర్మయి, డీఈ శ్రీకాంత్, వాటర్‌వర్క్స్ మేనేజర్ శ్రీధర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన బండ సూరి

కాచిగూడ: కాచిగూడ చెప్పల్‌బజార్ ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత బండ సూరి సోమవారం ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అవ్వవుతుందని అన్నారు.

ఈస్ట్-జోన్ డీసీపీగా బాలస్వామి



అంబర్‌పేట: ఈస్ట్-జోన్ డీసీపీగా బాలస్వామి బాధ్యతలు తీసుకున్నారు. సోమవారం సీపీఎల్ రోడ్‌లో ఉన్న డీసీపీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా మెదక్ జిల్లా నుంచి ఈస్ట్-జోన్ డీసీపీగా బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన గిరిధర్ బదిలీపై వనపర్తి జిల్లా ఎస్పీగా వెళ్లారు. ఈస్ట్-జోన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని డీసీపీ తెలిపారు.

ఘనంగా వైశ్య హాస్టల్ డే

కాచిగూడ: ప్రతి వ్యక్తి జీవితంలో రిస్క్ తీసుకుంటేనే విజయాలు సాధించి ఉన్నత స్థానాల్లో నిలుస్తారని జ్ఞాననిధి సేవా ట్రస్ట్ చైర్మన్ గీతా ఆచార్య ఎం.శ్రీనివాస్ అన్నారు. వైశ్య హాస్టల్ డే వేడుకలు సోమవారం కాచిగూడలోని హాస్టల్ ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి హాస్టల్ అధ్యక్షుడు ఉప్పల రాజేశ్వర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. విద్యార్థి దశలోనే తమకు ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఎదురయ్యే అవరోధాలను అధిగమించాలన్నారు. ఈ సందర్భంగా అతిథులను సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీబోర్డు చైర్మన్ జి.ధనుంజయ్, కార్యదర్శి విశ్వనాథం నగేష్, కోశాధికారి కూర రఘువీర్, వెంపటి మధు, వీరబోమ్మ శ్రీనివాస్, టి.శ్రీనివాస్, పబ్బతి రవిప్రసన్న కుమార్, పొద్దుటూరి రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎమరాల్డ్ మిఠాయి దుకాణంపై చర్యలు తీసుకోవాలి

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంజిరెడ్డి

ముషీరాబాద్: ఎమరాల్డ్ మిఠాయి దుకాణాలలో సేంద్రియ ఉత్పత్తులతో స్వీట్లు తయారు చేస్తున్నామని ప్రజలను నమ్మించి మోసం చేస్తున్న ఎమరాల్డ్ మిఠాయి దుకాణ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లవెల్లి అంజిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో ఎమరాల్డ్ స్వీటు షాపుపై ఫిర్యాదు చేశారు. నాణ్యత లేని బెల్లం, జీడిపప్పు వాడి అపరిశుభ్ర వాతావరణంలో స్వీట్లను తయారు చేస్తున్నారని అన్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న ఎమరాల్డ్ షాపు లైసెన్స్ రద్దు చేయలని డిమాండ్ చేశారు.

తెలంగాణ ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ఉద్యమకారులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు సుల్తాన్ యాదగిరి, తుమ్మల ప్రఫూల్ రాంరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యమంలో పోరాడిన, ప్రాణాలు అర్పించిన కొన్ని కుటుంబాలను మాత్రమే ప్రభుత్వం గుర్తించి ఆదుకుందన్నారు. మిగితా కుటుంబాలను కూడా ప్రభుత్వం గుర్తించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారులను గుర్తించి వారికి ఐడెంటిటీ కార్డులు ఇవ్వాలని కోరారు.

- కాంగ్రెస్ ఎన్నికల హామీ ప్రకారం ఉద్యమకారులకు 250గజాల చొప్పున ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. ప్రతి నెల రూ.30వేల గౌరవ వేతనం, ఉచిత బస్‌పాస్ సౌకర్యం, రూ.20లక్షల ఆరోగ్య బీమా, రాష్ట్ర ప్రభుత్వ విద్య, ఉద్యోగాల భర్తీలో ఉద్యమకారుల కుటుంబాలకు 5శాతం రిజర్వేషన్, ప్రభుత్వ పథకాల్లో తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అమరుల స్మృతి వనాన్ని వంద ఎకరాల్లో నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోయిపల్లి రంగారెడ్డి, చంద్రశేఖర్‌ప్రసాద్, గంటి చంద్రుడు, మాజీ సర్పంచ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్.వెంకటస్వామి, నల్లా రాధాకృష్ణ, గడ్డం రాజేష్, బత్తుల సామయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు

దోమల నివారణకు చర్యలు

అంబర్‌పేట: దోమల వల్ల వచ్చే వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు సర్కిల్-16 ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత తెలిపారు. అందులో భాగంగా సోమవారం సర్కిల్ పరిధిలో ఉన్న 37 పాఠశాలు, 11 కళాశాలల్లో దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించినట్లు ఆమె తెలిపారు. ఎంటామాలజీ అధికారులు, సిబ్బందితో కలిసి విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆమె వెల్లడించారు. ప్రతి శుక్రవారాన్ని 'ఫ్రై డే - డ్రై డే'గా జీహెచ్‌ఎంసీ నిర్వహిస్తోందన్నారు. వచ్చే శుక్రవారం అందరూ భాగస్వాములై దోమల నివారణకు కృషి చేయాలన్నారు.

సాహస యువకులకు సన్మానం

వరదనీటిలో కొట్టుకుపోతున్న కారులోని నలుగురిని కాపాడిన యువకులు





యువకులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కారు అద్దాలు పగులగొట్టడంతో చేతికి గాయం

ముషీరాబాద్: ప్రాణాలను తెగించి నలుగురిని కాపాడిన సాహస యువకులను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆయన కుమారుడు ముఠా జైసింహలు ఘనంగా సత్కరించారు. వారి ధైర్యసాహసాలను కొనియాడి నలుగురి ప్రాణాలను కాపాడినందుకు అభినందించారు. ఆదివారం రాత్రి 7గంటల సమయంలో కురిసిన భారీగా వర్షానికి సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి, ముషీరాబాద్, బాపూజీనగర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే నాలా పొంగిపొర్లింది. రాంనగర్‌లోని ఆశీర్వాద్ అపార్ట్‌మెంట్, బాపిస్టు చర్చీ మీదుగా వెళ్తున్న ఓ కారు నీటిలో కొట్టుకురావడాన్ని అక్కడే ఉన్న ఐదుగురు యువకులు గమనించారు. వెంటనే వారు నీటిలోకి దూకి కారును పక్కకు నెట్టి అందులో ఉన్న నలుగురిని సురక్షితంగా బయటకు తీశారు. కారు అద్దాలు పగులగొట్టే సమయంలో యువకుల చేతికి గాయాలయ్యాయి. ఈ వీడియో ఆదివారం రాత్రి అన్ని సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రణీత్‌యాదవ్, మోహన్‌యాదవ్‌తో పాటు మరో ముగ్గురు యువకులను శాలువాతో సన్మానించి అభినందించారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

కాచిగూడ: తెలంగాణ రాష్ట్రంలో విద్యాహక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బర్కత్‌పురలోని బీసీ కార్యాలయంలో విద్యార్థులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. కర్ణాటకలో అమలవుతున్న విధంగా ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం పేద విద్యార్థులకు ఉచిత సీట్లు కేటాయించాలన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేక విద్యా వ్యవస్థ పూర్తిగా కుంటుపడిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు పల్లవి, అంకిత, ఉమా, రాణి, శిరీష, దివ్య, ప్రీతి, రమేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ

ముషీరాబాద్: నిరుద్యోగులతో చర్చలు జరపొద్దనే మొండి వైఖరిని రాష్ట్ర ప్రభుత్వం వీడాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ప్రొ. చక్రధరరావు, ప్రొ. హరగోపాల్, కార్య నిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ అన్నారు. సమస్యలను పరిష్కరించకుండా నిరుద్యోగులను నిర్బంధించడం అప్రజాస్వామికం అని అన్నారు. కొన్ని వారాలుగా నిరుద్యోగులు తమ డిమాండ్లపై పోరాడుతున్నా ప్రభుత్వం చర్చలకు పిలవకపోవడం బాధాకరమని అన్నారు. డీఎస్సీ పరీక్షలను కొద్ది రోజులైనా పోస్ట్‌పోన్ చేయకపోవడం, డీఎస్సీ పరీక్షకు.. గ్రూప్-1 పరీక్షలకు మధ్య ఒక్కరోజు గడువు మాత్రమే ఇవ్వడం సరికాదన్నారు. ఇది ప్రజాపాలన అనిపించుకోదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిరుద్యోగులతో చర్చలు జరపాలని కోరారు.

నైపుణ్యాలపై అవగాహన సదస్సు

కవాడిగూడ: వరల్డ్ యూత్ స్కిల్స్ డేను పురస్కరించుకొని సోమవారం రామకృష్ణ మఠంలో యువత నైపుణ్యాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డా. ఇప్పో కమలాకర్స్ మైండ్ యాండ్ పర్సనాలిటీ కేర్, నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 10వ తరగతి పరీక్షల్లో 82శాతం మార్కులను సాధించిన నందకిషోర్‌కు సైకిల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ డా. జి.మహేందర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుతం చాలా మంది యువతి, యువకుల్లో నైపుణ్యం లేకపోవడం అతిపెద్ద సవాల్ అని అన్నారు. యువత నైపుణ్యాలు పెంచుకుంటే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం యువతలో సాధికాతను ప్రోత్సహించడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో డా. జి.మహేందర్‌కుమార్‌రెడ్డి, యోగాగురువు సరోజిని రామారావు, డాక్టర్ ఇప్పో కమాలకర్, కృష్ణవేణి, లత, వాణి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక సాహిత్య మందిర్ నూతన కార్యవర్గం ఎన్నిక

కాచిగూడ: కర్ణాటక సాహిత్య మందిర్ (2024-26) నూతన కార్యవర్గ ఎన్నికలు కాచిగూడలోని కర్ణాటక సాహిత్య మందిర్ హాల్‌లో జరిగాయి. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి సంజయ్ మనసబ్‌దార్ ప్రకటించారు. అధ్యక్షుడిగా సురేంద్ర కట్‌గేరి, ఉపాధ్యక్షులుగా రాఘవేంద్ర దేసాయి, గోపాల్ ఆశ్రిత్, కార్యదర్శిగా నరసింహామూర్తి జోయిస్, వర్కింగ్ కమిటీ సభ్యులుగా అంబుజ కులకర్ణి, జయశ్రీ ఏకే, ఉషా జోషి, ముకుంద్ కులకర్ణి, హెచ్‌ఎస్ మనసబ్‌దార్, సుదేంద్ర కులకర్ణి, కీర్తిసాగర్ మాన్వీకర్, రమేష్ మంజునాథ్, గోవింద్ రావు టేకల్‌కోట్, టి.గురురాజ్ , జి. భీమ్‌సేన్, గిరి కుకలర్ణి, జితేంద్ర కాజన్‌దార్, పరిమల కులకర్ణిలు ఎన్నికయ్యారు.

వర్షాకాలంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

అంబర్‌పేట: వర్షాకాలంలో తలెత్తె సమస్యల పట్ల క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ సూచించారు. సోమవారం అంబర్‌పేట సర్కిల్‌లోని గోల్నాక, అంబర్‌పేట డివిజన్‌లలో పలు సమస్యలపై డీఎంసీ మారూతీ దివాకర్, ఇతర అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. భారీ వర్షాలకు వరదనీరు ఆటంకం లేకుండా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాలాల్లో పూడిక, చెత్తలేకుండా జాగ్రత్తా చర్యలు తీసుకుంటే వర్షపు నీరు సులువుగా వెళ్లి పోతుందన్నారు. అలాగే దోమలు, బహిరంగ చెత్తడంపింగ్ కేంద్రాల వంటి అంశాలతో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రమాదకరంగా ఉండే నాలాలు, మ్యాన్‌హోళ్లపై ఇంజినీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

దుర్గాబాయి దేశ్‌ముఖ్ సేవాలు చిరస్మరణీయం

అంబర్‌పేట: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు దుర్గాబాయి దేశ్‌ముఖ్ సమాజానికి అందించిన సేవాలు చిరస్మరణీయం అని డీడీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతి వేడుకలను కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళాల కోసం దుర్గాబాయి స్థాపించిన సంస్థలు అందిస్తున్న సేవాలు ఎనలేనివని అన్నారు.

అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట.!

కాచిగూడ: ప్రాథమిక విద్యను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం 'అమ్మ మాట - అంగన్‌వాడీ బాట'అనే నినాదంతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ తెలిపారు. సోమవారం కాచిగూడ డివిజన్, మోతీలాల్ నెహ్రూనగర్ బస్తీలో అమ్మమాట అంగన్‌వాడీ బాట అవగాహన ర్యాలీని నిర్వహించారు. అంగన్‌వాడీలో పిల్లలను చేర్పించాలని పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.బాల, ఎన్‌జీఓ మల్లేశ్వరీ, అంగన్‌వాడీ టీచర్లు శర్మిల, శోభ, బి.యశోధ, ఏఎన్‌ఎం బీఎస్ రాధ, ఆశావర్కర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ జెండాలో శ్రీచక్రం ఉంచడం అన్యాయం

ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కమల సంతోష్‌కుమార్



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: పరబ్రహ్మ స్వరూపమైన ఆదిపరాశక్తి శ్రీచక్ర యంత్రాన్ని జనసేన పార్టీ జెండాలో ఉపయోగించడం అన్యాయమని... ఇది అమ్మవారిని, హైందవ ధర్మాన్ని అవమానించడమేనని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కమల సంతోష్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యపార్కులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలకు అమ్మవారి చిహ్నాన్ని ఉపయోగించడం హిందూ ధర్మాన్ని తుంగలో తొక్కడమేనని అన్నారు. ఈ చిహ్నాన్ని అనుమతించిన రాష్ట్ర, కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు బాధ్యత వహించాలన్నారు. ఈ విషయంపై తెలంగాణ డీజీపీ జితేందర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ స్పందించకుంటే కోర్టును ఆశ్రయించి న్యాయపరమైన పోరాటం చేస్తానని హెచ్చరించారు.